# సాక్షి కర్నూలు

శనివారం । 19 । అక్టోబర్ । 2024






## బైక్ దొంగ దొరికాడు

పోలీసుల కళ్లు గప్పి తప్పించుకు తిరుగుతున్న మోటారు సైకిళ్ల దొంగ ఎట్టకేలకు చిక్కాడు. రూ. 21.53 లక్షల విలువైన 23 బైక్‌లను ఆదోని పోలీసులు శుక్రవారం రికవరీ చేశారు. 8లో▸



## శాస్త్రోక్తంగా ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయల సేవ నిర్వహించారు. అమ్మవారికి అష్టోత్తరం, ఖడ్గమాల పూజలు జరిపించారు.



## టీబీ డ్యాం సమాచారం

| | |
|---|---|
| పూర్తి మట్టం (అడుగులు) | : 1,633 |
| ప్రస్తుతం | : 1,631.93 |
| సామర్థ్యం (టీఎంసీలు) | : 105.788 |
| ప్రస్తుతం | : 101.500 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | : 36,919 |
| అవుట్ ఫ్లో | : 36,799 |

## న్యూస్‌రీల్

### రెవెన్యూ గ్రామసభలు ప్రారంభం



ఓర్వకల్లు గ్రామసభలో వినతులు స్వీకరిస్తున్న జేసీ డాక్టర్ నవ్య

కర్నూలు(సెంట్రల్): భూ రీసర్వే జరిగిన గ్రామాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ గ్రామసభలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 26 మండలాల్లో ఒక్కో గ్రామంలో మొదటి రోజు గ్రామసభలు జరుగగా 997 అర్జీలు స్వీకరించారు. కాగా, గ్రామసభలో ఎక్కువగా భూ విస్తీర్ణం, పేర్లు మార్పు, మరోసారి సర్వే, విభాగాలు చేయడం తదితర సమస్యలపై రైతులు వినతి పత్రాలు అందజేశారు. ఓర్వకల్లు మండలం తిప్పాయిపల్లెలో జరిగిన గ్రామసభలో జేసీ డాక్టర్ బి.నవ్య, సర్వే ఏడీ మునికన్నన్ పాల్గొని వినతులు స్వీకరించారు.

### అవినీతి ఈఓపై సస్పెన్షన్ వేటు

ఓర్వకల్లు: కాల్వబుగ్గ దేవస్థానంలో అక్రమాలకు పాల్పడిన ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్‌పై ఎట్టకేలకు సస్పెన్షన్ వేటు పడింది. భక్తుల నుంచి వివిధ రూపాలలో ఆలయానికి వచ్చిన నిధులను స్వాహా చేసినట్లు వెలుగు చూడటంతో దేవదాయ శాఖ విచారణ చేపట్టింది. విచారణలో రూ.1.30 కోట్లను తమ సొంత ఖాతాకు మళ్లించినట్లు నిర్ధారణ అయినట్లు నివేదికను అధికారులు అందజేశారు. దీంతో రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### రహదారుల విస్తరణ పనులు షురూ

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ పరిధిలో పలు రోడ్ల విస్తరణకు నగరపాలక యంత్రాంగం సమాయత్తమవుతోంది. రద్దీగా ఉన్న ప్రాంతాల్లో ముందుగా విస్తరణకు శ్రీకారం చుడుతున్నారు. శుక్రవారం స్థానిక నంద్యాల చెక్‌పోస్టు నుంచి నందికొట్కూర్ రోడ్డులో ఉన్న ఎస్.ఎస్ గార్డెన్ వరకు మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టేందుకు సర్వే చేశారు. అలాగే పాతబస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ నుంచి రాఘవేంద్ర మఠం వరకు అలాగే కిడ్స్ వరల్డ్ నుంచి కల్లూరు దర్వాజ మీదుగా కలెక్టరేట్ కార్యాలయం వరకు 100 అడుగుల రోడ్డుకు ప్రతిపాదనలు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. ఇప్పటికే వీటికి సంబంధించిన నిధులు మంజూరయ్యాయి.

### ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పెంపు

కర్నూలు సిటీ: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక పీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ తరగతి, ఇంటర్మీడియేట్ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు డీఈఓ శామ్యూల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఈ నెల 25వ తేది వరకు గడువు పెంచారన్నారు. 10వ తరగతి అడ్మిషన్‌కు 14 ఏళ్లు, ఇంటర్మీడియెట్‌కు 15 ఏళ్లు వయస్సు ఉండాలన్నారు. వివరాలకు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్ లేదా దగ్గరలోని స్టడీ సెంటర్లలో సంప్రదించాలని ఆయన వెల్లడించారు.

### జాతీయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

- మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సయ్యద్ సబీహా పర్వీన్

కర్నూలు(అర్బన్): మౌలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టిన రోజు (నవంబర్ 11వ తేదీ ) సందర్భంగా అందజేసే జాతీయ స్థాయి పురస్కారాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సయ్యద్ సబీహా పర్వీన్ కోరారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉర్దూ భాషాభివృద్ధి, సాహిత్య, విభిన్న విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన వారికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ స్థాయి పురస్కారం (రూ.1.25 లక్షల ప్రోత్సాహకం, సర్టిఫికెట్, మెమొంటో), డాక్టర్ అబ్దుల్ హఖ్ ప్రాంతీయ స్థాయి పురస్కారం ( రూ.1 లక్ష ప్రోత్సాహకం, మెమొంటో, సర్టిఫికెట్ ) అందించడం జరుగుతుందన్నారు. అలాగే రాష్ట్రానికి చెందిన ఉర్దూ సాహితీవేత్తలు, పండితులు, కవులు, పాత్రికేయులు, విమర్శ పరిశోధన, గద్య బోధన, ఉర్దూ సేవలకులతో పాటు వివిధ విభాగాల్లో సేవలు అందించిన ఆరుగురికి జీవిత కాల సాఫల్య పురస్కారాలు అందించడం జరుగుతుందన్నారు. ఉర్దూ భాషాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు 'ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం', ఉర్దూలో అత్యున్నత శ్రేణిలో రాణించిన విద్యార్థులకు 'ఉత్తమ విద్యార్థి పురస్కారం ' అందించనున్నారన్నారు. జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ దరఖాస్తులను సంబంధిత అధికారుల ద్వారా ఈ నెల 25వ తేదీలోగా పంపాల్సి ఉందన్నారు.

### ఉచిత పంటల బీమాకు కూటమి సర్కారు మంగళం

- రైతులు ప్రీమియం చెల్లిస్తేనే బీమా సదుపాయం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు విజయవంతంగా ఉచిత పంటల బీమా అమలు
- రైతులు పైసా చెల్లించకపోయినా రూ.1065.51కోట్ల పరిహారం చెల్లింపు
- తాజాగా కూటమి సర్కారు నిర్ణయంతో రైతులు బీమాకు దూరం అయినట్లే



# రైతులపైనే భారం!

ఉచిత పంటల బీమాపై కూటమి సర్కారు చేతులెత్తేసింది. రబీ నుంచి ఆ భారాన్ని రైతులే భరించాలని తేల్చిచెప్పింది. అష్టకష్టాలు పడి ప్రీమియం చెల్లించినా బీమా పరిహారం వస్తుందనే నమ్మకం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించకుండానే బీమా సదుపాయం పొందిన రైతన్నలు తాజాగా కూటమి సర్కారు తీసుకున్న నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కర్నూలు(అగ్రికల్చర్): ఉచిత పంటల బీమాకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మంగళం పలికింది. 2019–20 నుంచి 2023–24 వరకు వైఎస్ జగన్ ప్రభుత్వం ఉచిత పంటల బీమాను విజయవంతంగా అమలు చేసింది. రైతులు ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించకుండానే బీమా సదుపాయం పొందేవారు. ఎన్నికల సమయంలో అధికారం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు రైతులకు మాయమాటలు చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వ అసలు రూపం బయటపడింది. రైతుల సంక్షేమం మాటల్లోనే తప్ప చేతల్లో లేదనే విషయం నిర్ధారణ అయింది. ఏటా రైతులకు రూ.20 వేలు చెల్లిస్తామనే సూపర్-6 హామీ గాలిలో కలిసి పోయింది. వచ్చి రావడంతోనే ఉచిత పంటల బీమా ఉండదని, బీమా పొందాలంటే ప్రీమియం చెల్లించడం తప్పనిసరి అని కూటమి ప్రభుత్వం తేల్చి చెప్పడంతో రైతులు ఉలికిపాటుకు గురవుతున్నారు. బాబు పాలనలో 2014–15 నుంచి 2018–19 వరకు ఉన్న తరహాలోనే ఇక నుంచి రైతులు ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తింపు విధానం అమలవుతుంది.

**రబీలో ఆరు పంటలకు బీమా...**

రబీలో ప్రధాన మంతి ఫసల్ బీమా కింద ఐదు పంటలు, వాతావరణ ఆధారిత బీమా కింద ఒక పంట నోటిఫై అయింది. ఈ పంటలకు బీమా చేసుకోవాలంటే రైతువాటా ప్రీమియం చెల్లించాల్సిందే. ప్రధానమంత్రి ఫసల్ బీమా (దిగుబడి ఆధారిత బీమా) కింద గ్రామం యూనిట్‌గా శనగ, మండలం యూనిట్‌గా వేరుశనగ, జొన్న, వరి, జిల్లా యూనిట్‌గా ఉల్లి పంటలు నోటిఫై అయ్యాయి. వాతావరణ ఆధారిత బీమా కింద టమాట నోటిఫై అయింది. వాతావరణ బీమా కింద పరిహారం రిస్క్ పీరియడ్‌లో ఉన్న వాతావరణ పరిస్థితులను బట్టి లభిస్తుంది. ప్రీమియం చెల్లింపు విధానాన్ని కూటమి ప్రభుత్వం తీసుకురావడంతో రైతులు బీమాకు దూరం అయినట్లే. జిల్లాలో రబీలో 2,350 హెక్టార్లలో ఉల్లి సాగు అవుతుంది. ఉల్లికి బీమా చేయించుకోవాలంటే 5 శాతం ప్రకారం ప్రీమియం చెల్లించాల్సి ఉంది. జిల్లాలో శనగ దాదాపు 70 హెక్టార్లలో సాగు అవుతుంది. హెక్టారుకు రూ.1050 ప్రకారం ప్రీమియం చెల్లించాలి. రబీలో 1.10 లక్షల హెక్టార్లలో పంటలు సాగు అవుతాయి. ప్రీమియం చెల్లించాల్సి ఉండటం వల్ల 10 శాతం మంది రైతులు కూడా కట్టే అవకాశం లేదు. కష్టపడి ప్రీమియం చెల్లించినప్పటికి పంట సాగు చేసినట్లుగా ఈ–క్రాప్‌లో నమోదు కావాలి. ఈ–కేవైసీ కూడా వేసి ఉండాలి.

**రబీలో బీమా చేయించుకోవాలంటే పంటల వారీగా ప్రీమియం ఇలా చెల్లించాలి....**

| పంట | బీమా యూనిట్ | బీమా చేసే మొత్తం (హెక్టారుకు,రూ.లలో) | రైతువాటా (శాతంలో) |
|---|---|---|---|
| శనగ | గ్రామం యూనిట్ | 70,000 | 1.5 |
| వరి | మండలం యూనిట్ | 1,05,000 | 1.5 |
| జొన్న | మండలం యూనిట్ | 49,500 | 1.50 |
| వేరుశనగ | మండలం యూనిట్ | 80,000 | 1.50 |
| ఉల్లి | జిల్లా యూనిట్ | 1,12,500 | 3.00 |
| టమాట | | 75,000 | 5.0 |

**పంటలు దెబ్బతింటే ఇంతే సంగతులే...**

2019–20 నుంచి 2023–24 వరకు ఉచిత పంటల బీమా ఉండటంతో అధిక వర్షాలు కురిసినా.. అనావృష్టి పరిస్థితులు ఏర్పడినా రైతులు నిశ్చింతగా ఉండే వారు. బీమా ఉంది అనే ధీమా ఉండేది. కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమాకు ఎగనామం పెట్టడంతో వారు ఒక్కసారిగా ఆత్మస్థైర్యాన్ని కోల్పోయినట్లు అయింది.వివిధ కారణాలతో పంటలు దెబ్బతింటే ఎలా...తమను ఆదుకునే దెవరు అనే ఆందోళన కర్షకుల్లో మొదలైంది. ఇప్పటికే తుపానులు వెంటాడుతున్నాయి. ఈ సమయంలో కూటమి సర్కారు ఉచిత పంటల బీమాకు మంగళం పాడటంతో రైతులకు భరోసా లేకుండా పోయింది.

**వైఎస్సార్‌సీపీ పాలనలో ఐదేళ్లు ఉచిత పంటల బీమా...**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన మొదటి ఏడాది అంటే 2019–20లో కేవలం ఒక్క రూపాయి ప్రీమియంతో నోటిఫై చేసిన పంటలకు బీమా సదుపాయం కల్పించింది. 2020–21 నుంచి వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. సన్న,చిన్న, మధ్య అనే తారతమ్యం లేకుండా, రాజకీయాలకు అతీతంగా ఈ–క్రాప్ డేటా ఆధారంగా రైతులకు బీమా సదుపాయం కల్పించింది. ఫలితంగా 2019–20 నుంచి 2022–23 వరకు ఈ పథకం కింద రైతన్నలకు రూ.1065.61 కోట్ల పరిహారం నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ అయింది. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే బీమా పరిహారం విడుదల చేయడం వల్ల రైతులకు ఊరట లభించింది. ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించకుండా రైతులు ఇంతభారీ మొత్తంలో బీమా పరిహారం పొందారంటే సాధారణ విషయం కాదు. రైతుల అభ్యున్నతి లక్ష్యంగా వైఎస్ జగన్ అమలు చేసిన ఈ పథకాన్ని నేడు కూటమి ప్రభుత్వం గంగలో కలిపేసింది.

**సర్కారు నిర్ణయంతో భారం**



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లు ఉచిత పంటల బీమాను అమలు చేసింది. రూపాయి ప్రీమియం చెల్లించకపోయినప్పటికీ రూ.2.50 లక్షల వరకు పరిహారం పొందాం. ఇప్పుడు రబీలో రెండు ఎకరాల్లో శనగ, మరో రెండు ఎకరాల్లో జొన్న సాగు చేశాము. ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకానికి ఎగనామం పెట్టడంతో సొంతంగా మేము ప్రీమియం చెల్లించాలంటే ఆర్థికంగా భారమవుతుంది. గత ప్రభుత్వంలో మాదిరిగానే కూటమి సర్కారే ఉచిత పంటల బీమాను అమలు చేయాలి.

– శంబులింగ, లింగందిన్నె హొళగుంద మండలం

## కొత్త చట్టాలపై అవగాహన కల్పించండి

- జిల్లా ఎస్పీ జి బిందుమాధవ్



జొన్నగిరి పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

తుగ్గలి: కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ పోలీసు సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా డీఎస్పీ వెంకటరామయ్య, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీతో కలిసి శుక్రవారం జొన్నగిరి, తుగ్గలి, మద్దికెర పోలీస్ స్టేషన్లు, పత్తికొండ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. పోలీస్ స్టేషన్ల నిర్వహణ, పరిసర ప్రాంతాలు, సిబ్బంది పని తీరు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, కేసు డైరీ, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. వివిధ కేసులపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న పాత కేసులు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. భూ వివాదాలు, పాత కక్షలు, మొదలైన అంశాలపై జరుగుతున్న నేరాలను అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తరచూ నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు వాహన తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఫిర్యాదుపై తక్షణమే స్పందించడంతో పాటు న్యాయం జరుగుతుందన్న నమ్మకం బాధితులకు కలిగేలా వ్యవహరించాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రోత్సహించి, గస్తీ నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అంకితభావంతో పనిచేసే పోలీసులు ప్రజల్లో గుర్తింపుతో పాటు అధికారుల నుంచి ప్రశంసలు అందుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సీఐలు ప్రసాద్, జయన్న, పులిశేఖర్, ఎస్ఐలు జయశేఖర్, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, గోపాల్, విజయనాయక్ ఏఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

## జిల్లాలో మోస్తరు వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. తుగ్గలి, వెల్దుర్తి, గూడూరు, నందవరం మండలాలు మినహా మిగిలిన అన్ని మండలాల్లో వానలు పడ్డాయి. కర్నూలు అర్బన్‌లో 16.8 మి.మీ, మద్దికెరలో 16, హొళగుందలో 15.2, కల్లూరులో 11.8, చిప్పగిరిలో 10.4, ఆదోనిలో 9.6, కర్నూలు రూరల్‌లో 8.8 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తం మీద సగటున 4.8 మి.మీ వర్షపాతం నమోదు అయింది. అక్టోబరు నెల సాధారణ వర్షపాతం 110.2 మి.మీ ఉండగా... ఇప్పటి వరకు 71 మి.మీ వర్షపాతం నమోదైంది. శుక్రవారం సాయంత్ర కురిసిన వానకు ఆదోనిలో పలు కాలనీలు జలమయమయ్యాయి. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. అలాగే ఆలూరు సమీపంలోని చిప్పగిరి రహదారిలోని కల్లివంకవాగు ఉప్పొంగి ప్రవహించడంతో వాహనాలు గంట పాటు నిలిచిపోయాయి.



ఆదోనిలో జలమయమైన రోడ్డు

**సుంకేసుల నుంచి నీటి విడుదల**

కర్నూలు సిటీ: సుంకేసుల రిజర్వాయర్ నుంచి దిగువకు నీటిని విడుదల చేశారు. తుంగభద్ర, వేదావతి నదుల పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సుంకేసుల బ్యారేజీకి నీటి ప్రవాహం శుక్రవారం పెరిగింది. ఎగువ నుంచి వస్తున్న నీటిని దృష్టిలో పెట్టుకొని కేసీ ఇంజినీర్లు బ్యారేజీకి చెందిన 10 క్రస్ట్‌గేట్లను పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. బ్యారేజీకి 43,560 క్యూసెక్కులు చేరుతుండగా.. కేసీ కాలువకు 2095 క్యూసెక్కులు, గేట్ల ద్వారా దిగువకు 42,420 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

## దోమల వృద్ధిని అరికట్టాలి



నీటి తొట్టిలో దోమల లార్వాలను చూపుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి దోమల వృద్ధిని అరికట్టాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్ సూచించారు. శుక్రవారం స్థానిక జొహరాపురం యుపీహెచ్‌సీ పరిధిలోని ఏపీహెచ్‌బీ కాలనీలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది వారి పరిధిలోని వార్డులను సందర్శించి ప్రజలు వారానికి ఒకసారి నీటి నిల్వలు లేకుండా పూర్తిగా తొలగించి దోమల పెరుగుదలను అరికట్టే విధంగా అవగాహన కల్పించాలన్నారు. తద్వారా దోమల వల్ల వ్యాప్తి చెందే వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోదకాలు, మెదడువాపులను అరికట్టవచ్చన్నారు. నీటి నిల్వలతో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో డీఎంవో నూకరాజు, యుపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక, ఆరోగ్య కార్యకర్త ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి లేకపోతే చర్యలు

- ఆర్‌డీఓలు, స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలను హెచ్చరించిన కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు (సెంట్రల్): ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి చూపకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్ నుంచి మండల అధికారులతో హౌసింగ్, ఉపాధి హామీ, పీజీఆర్ఎస్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి వంద రోజుల లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆదోనిలో ఇళ్ల నిర్మాణాల పురోగతి తక్కువగా ఉందని, లక్ష్యానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను ఆదేశించారు. ఆప్షన్-3 కింద ఉన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి కాంట్రాక్టర్లతో మాట్లాడి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక, సిమెంటు సమస్యలు ఉంటే జాయింట్ కలెక్టర్ బి.నవ్య దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలను సచివాలయాల వారీగా సమీక్షించాలని, వాటిని పూర్తి చేయించే బాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అప్పజెప్పాలని కలెక్టర్ సూచించారు. ఉపాధి హామీలో 90 రోజుల పనిదినాల కల్పనలో ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కోడుమూరు, సి.బెళగల్, మంత్రాలయం, హొళగుంద, కోసిగి మండలాల్లో పురోగతి తక్కువగా ఉందని, వాటిపై దృష్టి సారించాలన్నారు. హార్టికల్చర్ ప్లాంటేషన్‌లో 4,312 ఎకరాలకు గాను 3,400 ఎకరాలు పూర్తి చేశామని డ్వామా అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పీజీఆర్ఎస్‌కు సంబంధించి జిల్లాలో జూన్ 15 నుంచి ఇప్పటివరకు 4,658 అర్జీలు వచ్చాయని, అందులో 3,549 అర్జీలను పరిష్కరించారని, 122 అర్జీలు మాత్రం ఇప్పటి వరకు పరిష్కరించలేదన్నారు. పల్లె పండుగకు సంబంధించి సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, గోకులాల నిర్మాణాల పనులను మంజూరు చేశామని, వాటిని జనవరి లోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో చిరంజీవి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, హౌసింగ్ పీడీ విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెలోకి

- వైద్యమిత్రల అల్టిమేటం

కర్నూలు(హాస్పిటల్): తమ సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 29వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.లక్ష్మీ ప్రసన్న, జిల్లా కార్యదర్శి జి. రాజశేఖరరెడ్డి తెలిపారు. శుక్రవారం కర్నూలులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్‌టీఆర్ వైద్యసేవ ఉద్యోగుల సమస్యలు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ గత 17 సంవత్సరాల నుంచి తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదన్నారు. పనికితగ్గట్టు ఫీల్డ్ సిబ్బందికి న్యాయం జరగడం లేదన్నారు. అందరికీ కాలానుగుణంగా మార్పులు వస్తున్నప్పటికీ వైద్యమిత్రలకు ఎలాంటి ఎదుగూబొదుగూ లేకుండా చాలీచాలని జీతాలతో బతుకులు వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కేవలం రూ.13,087లు మాత్రమే వస్తాయని, దాంతో ఇంటి అద్దె, పిల్లల చదువు, తల్లిదండ్రుల ఆరోగ్య, ఇంటిఖర్చులకు ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. తమకు జీతభత్యాలు పెంచాలని, క్యాడర్ ఇవ్వాలని కోరారు. తమను అవుట్‌సోర్సింగ్ నుంచి కాంట్రాక్టు విధానంలోకి మార్చాలన్నారు. వైద్యమిత్రలకు పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రిటైరైన, అవుతున్న వారికి రూ.10లక్షల గ్రాట్యుటి ఇవ్వాలని, వైద్యమిత్రలకు అన్ని పథకాలు అమలు అయ్యేటట్లు చూడాలని కోరారు.



సమ్మె నోటీసు పత్రాన్ని చూపుతున్న వైద్యమిత్రలు



### కమనీయం... పవిత్రోత్సవం

పవిత్ర హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో వార్షిక పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం తెల్లవారు జామున మూలవిరాట్ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లకు నిత్య పూజల అనంతరం అర్చనలు, హారతులతో ప్రత్యేక పూజలు చేపట్టారు.. పవిత్ర యాగశాలలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదు స్వాములను కొలువుంచి నవకలశ స్నపనం నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య పవిత్ర హోమం నిర్వహించారు. రాత్రి ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుంచి మంగళ వాయిద్యాల మధ్య మాడవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

## శ్రీశైలం దేవస్థాన ఈఓ బదిలీ

- సహాయ కమిషనర్ చంద్రశేఖరరెడ్డికి ఇన్‌చార్జ్ ఈఓ బాధ్యతలు



బదిలీ అయిన డి.పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న డి.పెద్దిరాజును రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. డి.పెద్దిరాజును తన మాతృ సంస్థ అయిన రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు ఇన్‌చార్జ్ కార్యనిర్వహణాధికారిగా దేవస్థాన సహాయ కమిషనర్ చంద్రశేఖరరెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. డి.పెద్దిరాజు డిప్యుటేషన్‌పై గత సంవత్సరం సెప్టెంబరు 25న శ్రీశైల ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఏడాది కాలపరిమితి పూర్తవడంతో ఆయన బదిలీ అవుతారని ప్రచారం జరిగింది. అయితే ఊహించని విధంగా ఆయననే ఈఓగా కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన పది రోజులకే తిరిగి ఆయనను బదిలీ చేయడం కొసమెరుపు. అయితే శ్రీశైల దేవస్థానంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఉన్నప్పటికీ సహాయ కమిషనర్‌కు ఇన్‌చార్జ్ ఈఓగా బాధ్యతలు అప్పగించడంతో క్షేత్రంలో చర్చ కొనసాగుతోంది.

## క్లుప్తంగా

### 30లోగా పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ ప్రక్రియ పూర్తి కావాలి

కర్నూలు(అర్బన్): 2024–25 విద్యా సంవత్సరానికి కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు సంబంధించి పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు అర్హులైన విద్యార్థుల కొత్త రిజిస్ట్రేషన్, రెన్యూవల్ ప్రక్రియను ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె. రంగలక్ష్మీదేవి కోరారు.జిల్లాలోని అన్ని కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్ ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.కొత్తరిజిస్ట్రేషన్, రెన్యూవల్స్ చేసేందుకు సేవలను http://jnanabhumiv2. apcfss. in వెబ్‌సైట్ పోర్టల్‌లో కళాశాల జ్ఞానభూమి లాగిన్‌లో ఇవ్వడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి ఆయా కళాశాలల్లో స్కాలర్‌షిప్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తక్షణమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

### ఆర్‌యూలో ఇంజినీరింగ్ విద్యార్థులకు కౌన్సెలింగ్

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థులకు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు కౌన్సెలింగ్ ఇచ్చారు. గురువారం అర్ధరాత్రి బీటెక్ జూనియర్ విద్యార్థి సునీల్‌పై 15 మందికి పైగా సీనియర్ విద్యార్థులు దాడి చేసి గాయ పరిచారు. శుక్రవారం రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు, వర్సిటీ హాస్టల్స్ చీఫ్ వార్డెన్ ఆచార్య విశ్వనాథరెడ్డి బాధిత విద్యార్థి సునీల్‌ను రిజిస్ట్రార్ చాంబర్‌లోకి పిలిపించుకొని జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. సీనియర్ విద్యార్థులతో మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి వారి సమక్షంలో మరోసారి విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి అండర్ టేకింగ్ తీసుకుంటామని రిజిస్ట్రార్ తెలిపారు. తాలూకా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీధర్ స్టేషన్‌లో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

### వ్యక్తి ఆత్మహత్య

బనగానపల్లె: మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన సుబ్బిశెట్టి కిరణ్(35) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాలు.. సుబ్బిశెట్టి కిరణ్ మద్యానికి బానిస అయ్యాడు. ఈక్రమంలో ఆరోగ్యం క్షీణించింది. మరోవైపు అప్పుల పాలయ్యాడు. దీంతో గురువారం రాత్రి పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి నంద్యాలకు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. భార్య ప్రేమమ్మ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

### మూడు రోజులైనా ఏర్పాటు కాని మద్యం షాపులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండల కేంద్రమైన సున్నిపెంటలో మూడురోజులైనా మద్యంషాపులు ఏర్పాటు కాలేదు. షాప్ పర్మిట్లు తెలంగాణ ప్రాంత వాసులు దక్కించుకోవడం.. వారికి షాపులు ఏర్పాటు చేసుకునే క్రమంలో స్థానిక సిండికేట్‌దారులు అడ్డంకులు సృష్టిస్తుండటంతో దుకాణాల ఏర్పాటు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మద్యం ప్రియులు సరిహద్దులో ఉన్న తెలంగాణకు వెళ్లి మద్యాన్ని కొనుగోలు చేస్తుండగా అక్కడి దుకాణాదారులు క్వార్టర్‌పై రూ.30 చొప్పున ఎక్కువకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

# దర్జాగా సబ్‌లీజ్

- పసువుల పీఏసీఎస్ షాపింగ్ కాంప్లెక్స్‌లో మద్యం షాపు
- సహకార సంఘం అధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండా కట్టబెట్టిన లీజుదారుడు
- షాపింగ్ కాంప్లెక్ ఎదురుగా మసీదు, మరోవైపు లేడీస్ హాస్టల్
- 48 గంటల్లో మద్యం షాపును ఖాళీ చేయాలని సహకార శాఖ అధికారుల నోటీసు
- ససేమిరా అంటున్న లిక్కర్‌షాపు యజమాని



పసుపల పీఏసీఎస్ షాపింగ్ కాంప్లెక్స్‌లో కొత్తగా మద్యం షాపు ఏర్పాటు చేసిన దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): నిబంధనలకు విరుద్ధంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి చెందిన దుకాణాన్ని ఓ వ్యక్తి ఏకంగా మద్యం దుకాణం నిర్వహణకు సబ్ లీజ్ ఇచ్చేశాడు. మూడేళ్ల అగ్రిమెంటుపై ఏడాది కిత్రం అద్దెకు తీసుకొని ఈ ఘనకార్యం చేశాడు. విషయం తెలుసుకున్న సహకార శాఖ అధికారులు, జిల్లా సహకార కేంద్రబ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేశారు. కర్నూలు శివారులోని వెంకాయపల్లి ఎల్లయ్య దేవాలయం సమీపంలో ప్రధాన రహదారిపై పసుపుల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించింది. ఏడాది క్రితం దీనిని ప్రారంభించారు. ఇందులో 4 షాపులను జగదీశ్వరరెడ్డి అనే వ్యక్తికి 3 ఏళ్ల అగ్రిమెంటుపై అద్దెకు ఇచ్చారు. ఆది దివ్య ఎంటర్‌ప్రైజెస్ పేరుతో అతను సిమెంటు హార్డ్‌వేర్ షాపు నిర్వహిస్తున్నారు. అద్దెకు ఇచ్చి ఏడాది గడుస్తోంది. అద్దెకు తీసుకున్న నాలుగు షాపుల్లో మూడు షాపులు తాను వ్యాపారం చేసుకుంటూ ఒక వైపునకు ఉన్న మరో షాపును నిబంధనలకు విరుద్ధగా టీడీపీ వర్గీయులకు మద్యం దుకాణం కోసం సబ్ లీజుకు ఇచ్చాడు. ఈ దుకాణం పక్కన ఖాళీ ప్రదేశం కూడా ఉండటంతో మినీ బార్‌గా నిర్వహించుకోవడానికి మద్యం షాపు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

**48 గంటల్లో ఖాళీ చేయాలని నోటీసులు**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి చెందిన దుకాణాలను అద్దెకు తీసుకున్న వ్యక్తులు ఎట్టి పరిస్థితుల్లో ఇతరులకు సబ్ లీజుకు ఇవ్వరాదనే షరతు ఉంది. దీనిని ఉల్లంఘించి జగదీశ్వరరెడ్డి అనే వ్యక్తి లిక్కర్ వ్యాపారానికి సబ్‌లీజ్‌కు ఇవ్వడాన్ని సహకార శాఖ అధికారులు, జిల్లా సహకార కేంద్రబ్యాంకు అధికారులు తీవ్రంగా పరిగణించారు. కృష్ణానగర్ బ్రాంచీ అధికారులు, పసుపల పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ లక్ష్మీకాంతరెడ్డి వెంటనే షాపింగ్ కాంప్లెక్స్‌కు వెళ్లి వివరాలు ఆరా తీశారు. 48 గంటల్లో మద్యం షాపును ఖాళీ చేయాలని నోటీసు ఇచ్చారు. అయితే, ఖాళీ చేసేందుకు మద్యం షాపు నిర్వాహకులు ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే మద్యం షాపు నిర్వాహకుల వెనుక టీడీపీ నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. సబ్ లీజుపై మద్యం షాపు కొనసాగితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సహకార సంఘాల షాపింగ్ కాంప్లెక్స్‌ల్లోని షాపులను అద్దెకు తీసుకున్న వారు సబ్ లీజుకు ఇచ్చే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో నిబంధనలను ఉల్లంఘించి సబ్ లీజుకు ఇచ్చిన జగదీశ్వరరెడ్డికి కూడా నోటీసు ఇచ్చినట్లు తెలుస్తోంది.

**మసీదు, లేడీస్ హాస్టల్ సమీపంలోనే మద్యం షాపు ఏర్పాటుపై ఆందోళన**

నిబంధనల ప్రకారం మసీదు, దేవాలయం, పాఠశాల వంటి వాటికి 500 మీటర్ల పరిధిలో ఎలాంటి మద్యం షాపు ఏర్పాటు చేయరాదు. ఇక్కడ ఏర్పాటు చేసిన మద్యం షాపునకు ఎదురుగా 100 మీటర్లలోపే మసీదు ఉంది. 300 మీటర్లదూరంలో లేడీస్ హాస్టల్ ఉంది. మద్యం దుకాణం పక్క నుంచే మహిళలు హాస్టల్‌కు వెళ్లాల్సి ఉంది. 500 మీటర్లలో ఎల్లమ్మ దేవాలయం కూడా ఉంది. ఇలాంటి ప్రదేశంలో మద్యం షాపు పెట్టుకోవడానికి ఎక్సైజ్ అధికారులు ఎలా అనుమతి ఇచ్చారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

### సీఎం గారూ హైకోర్టు బెంచ్ మరిచారా?



జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి

కర్నూలు (లీగల్): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు విషయం మరిచిపోయినట్లున్నారని కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి అన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై కేబినెట్ మీటింగ్‌లో చర్చించి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని గత నెలలో ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. అయితే, ఇప్పటి వరకు దానిని ఆచరణలో పెట్టకపోవడం బాధాకరమన్నారు. జిల్లా ప్రతినిధులు ముఖ్యమంత్రిపై ఒత్తిడి పెంచి కేబినెట్ సమావేశం ఏర్పరచి హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అంగీకారం తెలుపుతూ కేంద్రానికి లేఖ రాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రజల ఆకాంక్షను నెరవేర్చడంలో ప్రస్తుత ప్రభుత్వం సరైన రీతిలో స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వట్టి మాటలను కట్టిపెట్టి గట్టి మేలు తలపెట్టేలా చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

## కర్నూలు సర్కిల్ ఎస్‌ఈ బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఈగా బాధ్యతలు స్వీకరిస్తున్న బాలచందర్‌రెడ్డి

కర్నూలు (సిటీ) : జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్‌ఈగా బి.బాలచందర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సర్కిల్ ఇన్‌చార్జి ఎస్‌ఈగా రెడ్డి శేఖర్‌రెడ్డి పనిచేసేవారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన అనంతపురం జిల్లాకు బదిలీ కావడంతో ఖాళీగా ఉన్న ఆ స్థానంలో సర్కిల్ ఆఫీస్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న బి.బాలచందర్‌రెడ్డికి ఎస్‌ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సాయిప్రసాద్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో పలువురు ఇంజినీర్లు కలసి ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన కర్నూలు ప్రాజెక్టు సీఈ కబీర్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు.

**కర్నూలు సబ్ డివిజన్ డీఈగా నాగరాజు...**

చిన్ననీటిపారుదల శాఖ కర్నూలు సబ్ డివిజన్ డీఈఈగా నాగరాజుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సర్కిల్ ఆఫీస్ ఎస్‌ఈ బాలచందర్‌రెడ్డిని, కర్నూలు డివిజన్ ఈఈ శ్రీనివాసులును కలిశారు.

## సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్తంభించిన సేవలు

- వారం రోజులుగా పనిచేయని మార్కెట్ విలువల సర్వర్

కర్నూలు(సెంట్రల్): రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అతి ముఖ్యమైన మార్కెట్ విలువల నిర్ధారణ సర్వర్ వారం రోజులు షట్ డౌన్ అయింది. ఫలితంగా కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సేవలు స్తంభించిపోయాయి. దీంతో కార్యాలయాలకు వచ్చిన క్రయ, విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు వినియోగదారులకు కనీస సమాచారం ఇవ్వకుండా అధికారులు తిప్పు కుంటున్నారు. రిజిస్ట్రేషన్‌లు, మ్యూటేషన్ల ప్రక్రియలో మార్కెట్ విలువ అతి ముఖ్యం. ఒక పొలం, స్థలం, ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో మార్కెట్ విలువ ఆధారంగా ప్రభుత్వానికి చలానా రూపంలో నగదును విక్రయదారులు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే పొలాలు, ఇళ్లు మ్యూటేషన్ల ప్రక్రియలో పంచాయతీలు, మునిసిపాలిటీల్లో మార్కెట్ విలువ ఆధారంగా ప్రక్రియ కొనసాగిస్తారు. అయితే వారం రోజులుగా మార్కెట్ విలువలకు సంబంధించిన సర్వర్ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆయా సేవలకు సంబంధించి కార్యాలయాలకు వచ్చిన విక్రయదారులు నిరీక్షించాల్సి వస్తోంది. అధికారులు దీనిపై కనీస సమాచారం ఇవ్వడంలేదని, అడిగితే తీవ్ర నిర్లక్ష్యంతో సమాధానం చెబుతున్నారని కొందరు వినియోగదారులు వాపోతున్నారు. వెంటనే సర్వర్ సక్రమంగా పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని క్రయ, విక్రయాదారులు కోరుతున్నారు.



కల్లూరు, కర్నూలు సబ్ రిజిస్ట్రార్ల సమూదాయం

# మోటార్ సైకిళ్ల దొంగ అరెస్ట్

- రూ.21.53 లక్షల విలువ చేసే 23 బైకులు స్వాధీనం



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సోమన్న

ఆదోని అర్బన్: తప్పించుకుని తిరుగుతున్న మోటార్ సైకిల్ దొంగ శుక్రవారం ఆదోని పోలీసులకు చిక్కాడు. ఆ దొంగ నుంచి రూ.21.53 లక్షలు విలువ చేసే 23 బైకులను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి ఆదోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీఎస్పీ సోమన్న విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. డోన్ మండలం కొత్తబురుజు గ్రామానికి చెందిన రంగనాయకులు అలియాస్ కొమరంపులి ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్నాడు. ఇటీవల ఆదోని పరిధిలో ఎక్కువగా ఇలాంటి చోరీలు జరగడంతో పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు వన్ టౌన్ సీఐ శ్రీరామ్ నేతృత్వంతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదోనిలోని రాంజల రోడ్డులో ఓ వ్యక్తి ఏపీ 21సీసీ 4975 నంబర్ గల మోటార్ సైకిల్‌పై అనుమానాస్పదంగా తిరుగుతున్నాడని సమాచారం అందడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తర్వాత విచారించగా మొత్తం 23 బైక్‌లు చోరీ చేసినట్లు రంగనాయకులు అంగీకరించారు. దీంతో దొంగపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు. బైక్ చోరీల కేసును ఛేదించిన వన్‌టౌన్ సీఐ శ్రీరామ్, పోలీసులను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## చిరుత సంచారం



వెల్దుర్తి సమీపంలోని పొలాల్లో పాదముద్రలు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సమీపంలోని సుబ్బయ్య తాత దేవాలయానికి వెళ్లే దారిలో చిరుతపులి జాడలు కనిపించాయి. గురువారం ఆ ప్రాంతంలోని పొలాల్లో పని చేస్తున్న కొందరు రైతులు చిరుతపులి జింకను వెంబడించడాన్ని గుర్తించి గ్రామస్తులకు తెలిపారు. వారు శుక్రవారం ఫారెస్టు అధికారులకు సమాచారమిచ్చారు. శనివారం సంఘటనా స్థలానికి వెళ్లి పాద ముద్రలు పరిశీలించి, అవి చిరుతవో కాదో నిర్ధారిస్తామని వెల్దుర్తి ఫారెస్టు అధికారి రామచంద్రుడు తెలిపారు.

### దొంగ అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు


కర్నూలు (టౌన్): తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు పట్టుకున్నారు. కొంతకాలంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో దొంగతనాలు పెరిగాయి. ఇళ్లలో చోరీ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. దీంతో జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు కర్నూలు టౌన్ డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈనెల 17 వ తేదీ గురువారం కర్నూలులో అనుమానంగా తిరుగుతున్న వ్యక్తిని ప్రత్యేక టీమ్‌లు అదుపులోకి తీసుకున్నాయి. నిందితుడు ఫారూఖ్ నగర్‌లో నివసించే షేక్ అబ్దుల్ రహీమాన్, అలియాస్ అల్తాఫ్‌గా గుర్తించారు. విచారణలో అతను మరో ఇద్దరితో కలిసి ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 36 ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. దీంతో నిందితుడి నుంచి 43 తులాల బంగారు నగలు, 279.7 తులాల వెండిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు. దొంగతనాలకు సంబంధం ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేసి ఛేదించిన సీఐలు మురళీధర్ రెడ్డి, మధుసూదన్ గౌడ్‌తో పాటు స్పెషల్‌పార్టీ పోలీసులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

### మట్టిమిద్దె కూలి గాయాలు


అవుకు: మండల పరిధిలోని కొండమనాయునిపల్లె గ్రామంలో మట్టిమిద్దె కూలి కుటుంబ సభ్యులు గాయాలపాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎరుకలి కాలనీకి చెందిన కోనేటి వెంకటేష్ అతని కుటుంబ సభ్యులు గురువారం రాత్రి ఇంట్లో నిద్రకు ఉపక్రమించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు బాగా తడిసిన మట్టిమిద్దె రాత్రి కూలి కుటుంబ సభ్యులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

# మహిళ దారుణ హత్య

- మామే చంపాడంటూ మృతురాలి సోదరుడి ఫిర్యాదు



గొల్ల శిరీష (ఫైల్)



మహిళ మృతదేహాన్ని ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

నందికొట్కూరు: మండల పరిధిలోని నాగటూరు గ్రామ సమీపంలోని పొలంలో శుక్రవారం సాయంత్రం మహిళ దారుణ హత్యకు గురైంది. నాగటూరు గ్రామానికి చెందిన గొల్ల నరసింహులు, శిరీష (26) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా శుక్రవారం మొక్కజొన్న పొలం పనులకు వెళ్లిన శిరీషను సొంత మామ గొల్ల కురుమన్న హత్య చేసినట్లు తెలుస్తోంది. పంట కోత కోసిన చేనులో కంకులు ఏరుతున్న సమయంలో బండరాయితో తలపై మోది హత్య చేసి అక్కడి నుంచి పరారైనట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న డీఎస్పీ రామాంజనేయులు, సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐలు చంద్రశేఖర్, సురేష్‌బాబు, లక్ష్మీనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మహిళ మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతిరాలి సోదరుడు అశోక్ ఫిర్యాదు మేరకు మామపై హత్య కేసు, భర్త నరసింహులు, అత్త మహేశ్వరి, ఆడపచులపై వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు టౌన్ సీఐ తెలిపారు. కాగా గొల్ల కురుమన్నపై 2017లో ఓ బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడినట్లు కేసు నమోదైంది. ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్న కురుమన్నను ఎన్‌కౌంటర్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. తల్లి హత్యకు గురికావడంతో పిల్లలు అనాథలయ్యారు.

### యువకుడి మృతదేహం లభ్యం

మహానంది: రెండ్రోజుల క్రితం తెలుగుగంగ కాల్వలో పడి గల్లంతైన ఈశ్వర్‌నగర్ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థి గౌతమ్ సిద్ధార్థ(18) మృతదేహం రుద్రవరం సమీపంలోని తుళ్లేరు వద్ద శుక్రవారం లభ్యమైంది. రుద్రవరం పోలీసుల నుంచి మహానంది పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## మా ఊరిలో వైన్ షాప్ వద్దు



పాణ్యం పోలీసు స్టేషన్ వద్ద కౌలూరు గ్రామస్తులు

- అధికారులకు కౌలూరు గ్రామస్తులు వేడుకోలు

పాణ్యం: తమ గ్రామ పరిధిలో వైన్‌షాప్ ఏర్పాటు చేయరాదని కౌలూరు గ్రామ ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు. బలపనూరు మెట్ట–కౌలూరు గ్రామం మధ్యలో వైన్‌షాప్ ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి వెళ్లి ఈ మార్గంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వస్తుంటారని వైన్‌షాప్ ఏర్పాటుతో వారికి ఇబ్బంది అవుతుందని చెప్పారు. అయితే, నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో శుక్రవారం రాత్రి పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి తమ అభ్యంతరం తెలియజేశామని, ఆయన ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని కౌలురువాసులు తెలిపారు. సీఐని కలిసిన వారిలో కౌలురు గ్రామస్తులతో పాటు మలమహానాడు నాయకుడు దత్తు , ప్రజా సంఘాల నాయకుడు వెంకటాద్రి ఉన్నారు.